క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



వేలేరు : మండలంలోని షోడాషపల్లి గ్రామానికి చెందిన జినుకల రవికి రూ.21 వేలు, కవితకు రూ. 15 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ జెడ్పీటీసీ చాడ సరిత ఆదివారం అందజేశారు.రవి, కవిత ఇటీవలే అనారోగ్యం బారినపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందగా ఆర్థికంగా ఆదుకోవాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కోరగా స్పందించిన ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సంపత్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే టీంకు సహకరించాలి

న్యూశాయంపేట: హనుమకొండ జిల్లా పరిధి ధర్మసాగర్ మండలం ముప్పారం, వేలేరు మండలం ఎర్రవెల్లి, ఎల్కతుర్తి మండలం దామెర, భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామాల్లో ఇనుపరాతి గుట్టలోని ఫారెస్ట్ భూముల్లో నోటిపై చేసిన సర్వే నంబర్లలో నోటిఫికేషన్ సెక్షన్ (4), ఫారెస్ట్ యాక్ట్ ప్రకారం ఫారెస్ట్ భూములు, డిమార్కేషన్, హద్దులు నిర్ణయించుటకు సోమవారం నుంచి సర్వే నిర్వహించనున్నట్లు హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫారెస్ట్ అధికారులతో కూడిన కమిటీ సర్వే నిర్వహిస్తుందని, సర్వే టీంకు రైతులు సహకరించాలని కోరారు.

మంత్రులను కలిసిన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్



కమలాపూర్ : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తవుటం ఝాన్సీరాణి రవీందర్ ఆదివారం రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తనను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమించినందుకు ఝాన్సీరాణి వారిని శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

కెప్టెన్ లక్ష్మీకాంతారావు జన్మదిన వేడుకలు



ఎల్కతుర్తి: మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు 88వ జన్మదిన వేడుకలను ఆదివారం బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపం వద్ద ఘనంగా జరుపుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్ కేక్ కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన నాయకుడు, మంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ మేకల స్వప్న, మాజీ ఎంపీటీసీ కడారి రాజు, నాయకులు తంగెడ మహేందర్, గొల్లె మహేందర్, ఎల్తూరి స్వామి, హింగె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సీటీఐ కుటుంబానికి ఆర్థిక చేయూత



కాజీపేట రూరల్: అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందిన తెలంగాణ ఉద్యమ రైల్వే జేఏసీ నాయకుడు, రైల్వే సీటీఐ నాగరాజు కుటుంబ సభ్యులను తెలంగాణ రైల్వే జేఏసీ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.18 వేల ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు రైల్వే జేఏసీ కొండ్ర నర్సింగరావు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే జేఏసీ కోకన్వీనర్లు అనుమాల శ్రీనివాస్, జి.భాస్కర్, వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులకు త్వరలో చేస్తాం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ రావు

శాయంపేట : రుణమాఫీ అందని రైతులకు త్వరలో చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రైతులకు భరోసా ఇచ్చారు. స్థానిక ఎస్‌వికేకే ఫంక్షన్ హాల్‌లో ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 11 నెలల కాలంలో రూ.18 వేల కోట్ల రుణమాఫీని ఏకకాలంలో చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కొద్ది సమయంలోని ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలను అందించామని గుర్తు చేశారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని సూచించారు. త్వరలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరుస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలపై ఈ నెల 19న హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరిగే ప్రజా పాలన విజయోత్సవ సభకు మండలం నుంచి 3వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని, ఐకేపీ ఆధ్వర్యంలో కూడా వెయ్యి మంది మహిళలు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్, నాయకులు బాసాని శాంతరవి, చిందం రవి, బాసాని మార్కండేయ, చింతల రవిపాల్, పోలెపల్లి శ్రీనివాస్ రెడ్డి, మారెపల్లి వరదరాజు, అబ్బు ప్రకాష్ రెడ్డి, మారెపల్లి కట్టయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల : ఈనెల 19 హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న ఇందిరా మహిళాశక్తి బహిరంగ సభను విజయవంతం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సభకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, బూత్ స్థాయిలోని ప్రతి కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాయన్నారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్కు భూ నిర్వాసితులకు 863 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి నియోజవర్గ ప్రజల తరుపున ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, రాష్ట్ర నాయకులు దొమ్మాటి సాంబయ్య, గన్నోజు శ్రీనివాస్‌చారి, కట్కూరి దేవేందర్‌రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పాడి కల్పన దేవి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్‌రెడ్డి

కాజీపేట అర్బన్: వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలని ఐఎంఏ జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్‌రెడ్డి సూచించారు. 31వ డివిజన్ న్యూశాయంపేటలోని ఆకృతి అవెన్యూ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిరువరంగం ప్రభాకర్, శ్రీధర్, దేవేందర్ రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గడువు ముగిసినా రేషన్ బియ్యం ఇవ్వరా?

ఐనవోలు: గడువు ముగిసినా నవంబర్ నెలకు సంబంధించిన రేషన్ బియ్యం లబ్ధిదారులకు అందని పరిస్థితి మండలంలోని 13 రేషన్ షాపుల్లో చోటు చేసుకుంది. సాధారణంగా ప్రతి నెలా 1వ తేదీ నుంచి 17 వరకు గ్రామాల్లో రేషన్ బియ్యం డీలర్లు రేషన్ కార్డుదారులకు అందజేస్తారు. సివిల్ సప్లై నుంచి గ్రామాల్లోని డీలర్లకు బియ్యం అందగానే లబ్ధిదారులకు డీలర్ పంపిణీ చేస్తుంటారు. అయితే రేషన్ బియ్యం పంపిణీ గడువు ముగిసినప్పటికీ.. ఇప్పటి వరకు కూడా నందనం, రాంనగర్, లింగమోరిగూడెం, ఉడుతగూడెం, గర్మిళ్లపెల్లి, కక్కిరాలపల్లి, పెరుమాండ్లగూడెం, పంథిని, ఐనవోలు తదితర గ్రామాల పరిధిలోని 13 రేషన్ షాపులకు సివిల్ సప్లై నుంచి బియ్యం అందలేదు. దీంతో నవంబర్ నెలకు సంబంధించిన రేషన్ బియ్యం ఇస్తారా? ఇవ్వరా? అని ఆయా గ్రామాల లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. గత పదేళ్లలో కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఎన్నడూ ఇలాంటి పరిస్థితి రాలేదని రేషన్‌కార్డు దారులు వాపోతున్నారు. జిల్లా సివిల్ సప్లై వద్ద బియ్యం నిల్వలు లేకపోవడంతోనే రేషన్ షాపులకు ఈ నెల బియ్యం అందలేదని తెలుస్తోంది. దీనిపై సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఇంజనీరింగ్ విద్యార్థినికి ఎమ్మెల్యే చేయూత

ఐనవోలు: మండలంలోని వనమాల కనపర్తి గ్రామానికి చెందిన సింగారపు లాస్య చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్ ఎన్ఐటీలో ఇంజనీరింగ్ సీటు సాధించింది. కళాశాల ఫీజు కట్టలేని పరిస్థితి ఉండటంతో లాస్య ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును సుబేదారిలోని ఆయన నివాసంలో కలిసింది. స్పందించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తనవంతుగా రూ.లక్ష, తన మిత్రుడు కరణ్‌రాజు ద్వారా మరో రూ.లక్ష అందించారు. అదేవిధంగా ఎమ్మెల్యే సూచనల మేరకు అక్కడ ఉన్న నాయకులు తమకు తోచిన విధంగా ఆర్థికసాయం అందజేశారు. చదువు నిమిత్తం ఆర్థిక చేయూతనందించిన ఎమ్మెల్యే, నాయకులకు, కార్యకర్తలకు లాస్య, ఆమె తల్లి విమల కృతజ్ఞతలు తెలిపారు.



లాస్యకు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వర్గీకరణ సాధనే లక్ష్యంగా ధర్మయుద్ధం



ప్రతిజ్ఞ చేస్తున్న మండల కార్యవర్గం

గీసుకొండ : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత సాధించడమే లక్ష్యంగా ధర్మయుద్ధం చేసే దిశగా వచ్చే నెల 21న హైదరాబాద్‌లో మహాసభ నిర్వహించనున్నట్టు ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు బిర్రు మహేందర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుముల పూర్ణయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశానికి మహేందర్, రాజశేఖర్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. వర్గీకరణ అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలుపుకోవాలని కోరారు. మహాసభకు మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అక్కెల్లి నాగరాజు, అధికార ప్రతినిధిగా దౌడు దామోదర్, ఉపాధ్యక్షుడుగా గడ్డం బాలకృష్ణ, ఎంఎస్‌పీ అధ్యక్షుడిగా దక్క శ్యామ్ ప్రసాద్ ఎన్నికయ్యారు. కమిటీతో ప్రతిజ్ఞ చేయించారు.

కడియంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేలేరు: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రాజయ్య కమీషన్లు, పార్టీ టిక్కెట్లు, దళిత బంధు యూనిట్లు అమ్ముకున్న చరిత్ర అని విమర్శించారు. ఇనుపరాతి గుట్టల పరిధిలో ఉన్న ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తమ సమస్యను తీసుకువెళితే ఆయన సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం చేయాలని ప్రయత్నం చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు ఇనుపరాతి గుట్టల పేరుతో రాజకీయ చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధే గ్రామాల్లో కనిపిస్తుందని, పదేళ్లు రాజయ్య నియోజకవర్గానికి చేసిందేమిలేదని విమర్శించారు. బీఆర్ఎస్ వర్గపోరుతో రెండుగా చీలిందని, కొంతమంది బీఆర్ఎస్ నాయకులు స్థాయికి మించి మాట్లాడుతున్నారని అలాంటి వారికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తి సంపత్, నాయకులు మల్లికార్జున్, బిల్లా యాదగిరి, వల్లపురెడ్డి రాంరెడ్డి, రాజిరెడ్డి, రవీందర్ యాదవ్, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు కులగణన - సామాజిక న్యాయంపై రాష్ట్రస్థాయి సదస్సు

కేయూ క్యాంపస్: తెలంగాణ పూలే ఆశయ సాధన సమితి (పాస్) ఆధ్వర్యంలో కులగణన - సామాజిక న్యాయం అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సును కాకతీయ యూనివర్సిటీలోని ఎస్‌డీఎల్‌సీఈ జర్నలిజం విభాగం సెమినార్ హాల్‌లో ఈనెల 19న ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు పూలే ఆశయ సాధన సమితి అధ్యక్షుడు, సదస్సు నిర్వాహకుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ తెలిపారు. సదస్సులో ముఖ్యఅతిథిగా, ప్రధాన వక్తగా తెలంగాణ విద్యా కమిషన్ మెంబర్, ప్రొఫెసర్ పీఎల్.విశ్వేశ్వర్ రావు, విశిష్ట అతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ అతిథిగా ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్, సామాజిక ఉద్యమకారులు ప్రొఫెసర్ వెంకటనారాయణ పాల్గొంటారని మల్లేశ్వర్ వివరించారు.

అన్నదమ్ములకు గ్రూప్-4 ఉద్యోగాలు



ఓంప్రకాశ్



వంశీకృష్ణ

కమలాపూర్: ఓ కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు జోగు ఓంప్రకాష్, జోగు వంశీకృష్ణ గ్రూప్-4 ఉద్యోగాలు సాధించారు. జోగు మల్లేశం-మాధవి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఇద్దరు కొడుకులు 1 నుంచి 5వ తరగతి వరకు శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో, 6 నుంచి 10వ తరగతి వరకు శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం జమ్మికుంటలో, ఇంటర్ విద్యాన్ జూనియర్ కళాశాల హనుమకొండలో చదువుకున్నారు. ఓంప్రకాష్ కాకతీయ యూనివర్సిటీ వరంగల్‌లో సివిల్ ఇంజనీరింగ్, ఎంటెక్ జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో, వంశీకృష్ణ డిగ్రీ హైదరాబాద్‌లో, పీజీ ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్‌లో పూర్తి చేసి సుమారు నాలుగేళ్లుగా ఉద్యోగ అన్వేషణలో పడ్డారు. ఇటీవల విడుదలైన గ్రూప్-4 ఫలితాల్లో ఇద్దరు ప్రతిభ కనబర్చారు. ఓంప్రకాష్ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖలో, వంశీకృష్ణ పంచాయతీ రాజ్ అభివృద్ధి శాఖలో ఉద్యోగాలు సాధించారు.

మాలతికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో పరిశోధకురాలు బి.మాలతికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. కస్టమర్ సాటిస్ఫాక్షన్ అండ్ లాయలిటీ ఇన్ రిటైల్ స్టోర్స్ - ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ అవుట్‌లెట్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మాలతికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో మాలతి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. మాలతి స్వస్థలం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చంద్రుగొండ గ్రామం.

24న వనభోజన మహోత్సవం

హన్మకొండ చౌరస్తా: ధర్మసాగర్ మండల కేంద్రంలోని రిజర్వాయర్ కట్టపై నూతనంగా నిర్మిస్తున్న శ్రీభక్త మార్కండేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఈనెల 24న ఉదయం కార్తీకమాస వనభోజన మహోత్సవాన్ని హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయంలో మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పద్మశాలి కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వనభోజన కరపత్రాలను ఆవిష్కరించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మనోహర్‌కు టీచర్ ఇన్‌స్పిరేషన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న మనోహర్

హసన్‌పర్తి: 56వ డివిజన్‌లోని ఎస్‌వీఎస్ కాలనీకి చెందిన అనుమాండ్ల మనోహర్.. టీచర్ ఇన్‌స్పిరేషన్ అవార్డు -24కు ఎంపికయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్‌కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. గణిత సబ్జెక్ట్‌లో మెలకువలు, గణితాన్ని సులువుగా బోధిస్తున్నందుకు ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు. కాగా, ప్రస్తుతం మనోహర్ సంగెం మండలం మొండ్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

గ్రంథాలయ చైర్మన్లకు సన్మానం



కాజీపేట రూరల్: హనుమకొండ, జనగామ జిల్లాల గ్రంథాలయ చైర్మన్లుగా ఎంపికైన అజీజ్‌ఖాన్, మారజోడు రాంబాబును కాజీపేట 47వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు హనుమకొండలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. మైసారపు సిరిల్‌లారెన్స్, రాంబాబు, సిలువేరు విజయభాస్కర్, రాజ్‌కుమార్, భూషపాక శ్రీనివాస్, పోగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటాం



నిరసన తెలుపుతున్న నాయకులు

హన్మకొండ: బాలసముద్రంలో దాదాపు రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించిన కళాక్షేత్రంలో కళాకారులకు స్థానం లేకుండా, కళాకారుల విగ్రహాలు ఏర్పాటు చేయకుండా ఆవిష్కరణకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటామని టీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, ఎస్ఐఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ హెచ్చరించారు. ఈనెల 19న సీఎం పర్యటన సందర్భంగా హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళలు, కళారూపాలకు సంబంధం లేని కాళోజీ నారాయణరావు పేరు పెట్టడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కళాక్షేత్రంలో కళాకారుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని, కళాక్షేత్రానికి కళాకారుల పేర్లు పెట్టాలని నాలుగు నెలలుగా ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించినా ఫలితం లేదని వాపోయారు.

ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

న్యూశాయంపేట: ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరంతర రాజకీయ పాఠశాలను ఆదివారం ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రజా ఉద్యమాలను నిర్మించి ప్రజల మధ్యన ఉండి వారిని చైతన్యపరుస్తూ ప్రశ్నించే గొంతుకగా సీపీఐ పోరాటం చేస్తోందని వివరించారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు టి.భిక్షపతి, ఎల్లేశ్, లక్ష్మణ్, ఎం.భిక్షపతి, రాజమౌళి, సదానందం, సారంగపాణి, రమాదేవి, శంకర్‌నాయక్, రవి, వెంకటేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల కమిటీ



మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమితి నాయకులు

ఆత్మకూరు: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల కమిటీని మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆదివారం జిల్లా చైర్మన్ బండి అశోక్ కమిటీని నియమించారు. కన్వీనర్‌గా పసుల లక్ష్మీనారాయణ, కో కన్వీనర్లుగా సిరిమిల్ల రవీందర్, వంగేటి సత్యం, పెంతల రవిని నియమించారు. అలాగే నీరుకుళ్ల గ్రామ కమిటీ కన్వీనర్‌గా న్యాతకాని వనయ్య, కోకన్వీనర్లుగా న్యాతకాని పైడి, వంగేటి రవికుమార్, కిన్నెర రాజేందర్, సిరిమిల్ల రాజేందర్, వంగేటి మానస, సిరి మిల్ల కల్పన, దాసరి కవితను నియమించారు. సమావేశంలో హనుమకొండ జిల్లా కన్వీనర్ శ్రావణ్‌కుమార్, కోకన్వీనర్లు దండు రాజు, కూనమల్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీ స్టార్ టాలెంట్ టెస్ట్‌కు స్పందన



కాజీపేట అర్బన్: న్యూశాయంపేటలోని కోటా రాజస్థాన్ కెరీర్ పాయింట్ వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సీపీ స్టార్ టాలెంట్ 25కు విశేష స్పందన లభించిందని బ్రాంచ్ చైర్మన్ జూలపల్లి కరుణాకర్‌రావు తెలిపారు. 892 మంది పదవ తరగతి విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌కు హాజరైనట్లు వివరించారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లతో పాటు రివార్డులు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేందర్, డైరెక్టర్ మధుపాల్, తదితరులు పాల్గొన్నారు.